సాక్షి అనకాపల్లి

సోమవారం । 28 । ఏప్రిల్ । 2025



మే 20న జాతీయ సమ్మె 8లో

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ అఖిలపక్ష కార్మిక సంఘాలు మే 20న జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయి.



నూకాలమ్మా.. కరుణించమ్మా..

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగ జాతర ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. 8లో

ఉష్ణోగ్రతలు

	గరిష్టం/కనిష్టం	
అనకాపల్లి	36.8	26.9
చోడవరం	38.0	28.0

న్యూస్‌రీల్

మైనారిటీ స్వయం ఉపాధి పథకం కోసం దరఖాస్తుల ఆహ్వానం

తుమ్మపాల: మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులకు స్వయం ఉపాధి పథకం కింద ప్రత్యేక అవకాశాలు కల్పిస్తూ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీస్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షమ్ సున్నీసా బేగం ఒక ప్రకటనలో తెలిపారు. మైనారిటీ కులాల వారికి రూ.1లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రైస్తవ మైనారిటీ వారికి రూ.1 లక్ష నుండి రూ.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. రుణాలకు ఎంపిక అయిన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరు చేయబడుతుందని తెలియజేశారు. అర్హత కలిగిన వ్యక్తులు తమ వివరాలను (https://apobmms.apcfss.in) వెబ్‌సైట్ ద్వారా మే నెల 5 నాటికి నమోదు చేసుకోవాలన్నారు. గత 5 సంవత్సరాలలో రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వాల నుండి ఏవైనా రాయితీలు, సబ్సిడీలు పొందకూడదు. వయస్సు 21 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండాలి. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 0891- 2502271/ 98499 01159, 9441716209, 9100245438 ద్వారా గాని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్, డాక్టర్. దీన్ షాదీఖాన్, పాత పోస్ట్ ఆఫీసు, విశాఖపట్నం. కార్యాలయంలో గాని సంప్రదించవచ్చని ఆమె తెలిపారు.

నేడే మేయర్ ఎన్నిక

- కూటమి అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ మేయర్ ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికకు ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను ప్రభుత్వం నియమించింది. కాగా కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ప్రకటించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయనకు బీ-ఫారం అందజేశారు. మరోవైపు మేయర్ ఎన్నిక ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కౌన్సిల్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 10.30 గంటలకు గుర్తింపు కార్డులతో రావాలని సూచించారు.

కొమ్మాది అసిస్టెంట్ లైన్‌మన్ సస్పెన్షన్

మధురవాడ (విశాఖ): ప్రైవేట్ వ్యక్తితో పనులు చేయించి, ఆయన మరణానికి కారణమైన అసిస్టెంట్ లైన్‌మన్(ఏఎల్‌ఎం) కోటి సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఏపీఎస్ఈబీ నిబంధనలకు విరుద్ధంగా డిపార్ట్‌మెంట్ విధుల్ని అనధికారిక వ్యక్తితో చేయించే క్రమంలో ఆయన మరణానికి పరోక్షంగా కారణమైనందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న ఏపీ ట్రాన్స్‌కో విశాఖ జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం కొమ్మాది సబ్ స్టేషన్ పరిధిలో ఫ్యూజ్ ఆఫ్ కాల్ పనులు నిర్వహిస్తుండగా కొమ్మాదికి చెందిన దుప్పల వెంకటరమణ(27) అనే అనధికారిక వ్యక్తి విద్యుత్ స్తంభం నుంచి జారిపడ్డాడు. కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించాడు. తాను చెయ్యాల్సిన పనిని, అనధికార వ్యక్తి ద్వారా చేయించి, ఆయన మరణానికి కారణం కావడంతో ఏఎల్‌ఎం సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు.

- పాడిరైతుకు మనోవేదన
- అందని పశువైద్య సహాయం
- జిల్లాలో వెంటాడుతున్న పశువైద్యాధికారుల కొరత
- సిబ్బంది కొరతతో ప్రభుత్వ సదుపాయాలు అందని వైనం
- అత్యవసర సమయంలో గోపాలమిత్రులే దిక్కు

పాడి పశువుల మూగవేదన

రైతుకు వ్యవసాయం తర్వాత పాడి పశువులే ప్రధాన జీవనాధారం. పశువులకు ఏ రోగం వచ్చినా వైద్య సేవలు అందించేందుకు వైద్యులు వైద్య సహాయకులు లేక మూగవేదనతో జిల్లా అంతటా అల్లాడిపోతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా పాడి పరిశ్రమను నిర్లక్ష్యం చేసినట్టుగా కనిపిస్తోంది. పశువైద్య కేంద్రాల్లో సిబ్బంది కొరత కారణంగా పాడిరైతులకు పూర్తి సేవలు అందడం లేదు.



పశు వైద్యులు లేక నాతవరంలో మూసేసి ఉంటున్న పశువైద్యశాల

నాతవరం : జిల్లా వ్యాప్తంగా 13 వెటనరీ అసిస్టెంటు(ఏడీ) కేంద్రాలు 67 పశువైద్యశాలలు ఉన్నాయి. వాటిలో కోటవురట్ల వెటర్నరీ కేంద్రంలో పోస్టు ఖాళీగా ఉంది. ఒక వెటర్నరీ అసిస్టెంటు (ఏడీ) రెండు మండలాలకు పర్యవేక్షిస్తుంటారు. అదే విధంగా 67 పశువైద్యశాలకు 60 మందే పశువైద్యాధికారులు ఉన్నారు. మిగతా ఏడు పశువైద్యశాలలకు వైద్యాధికారులు లేక కేంద్రాలు నిరూపయోగంగా దర్శనమిస్తున్నాయి, వేటర్నరీ అసిస్టెంటు కేంద్రాలు పశువైద్యశాలలో జిల్లా వ్యాప్తంగా 114 మంది అటెండర్లు (సబ్ ఆర్డినేటర్లు) పోస్టులకు కేవలం 38 మాత్రమే పని చేస్తున్నారు. జిల్లాలో 76 పోస్టులు కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి ఖాళీగా ఉన్నాయి. వీటితో పాటు జిల్లాలో 48 వెటర్నరీ సహాయకులు పోస్టులకు కేవలం 26మంది మాత్రమే పని చేస్తున్నారు. మిగతా 22 మంది వెటర్నరీ సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్రంలో పశువైద్యాధికారులు లేకున్న సహాయకులు కేంద్రంలో ఉండి సకాలంలో పశువులకు వైద్య సేవలు గతంలో అందించేవారు. అటెండర్లు అవసరమైన సంఖ్యలో లేకపోవడంతో ఏడీలు, పశువైద్యాధికారులు పని చేసే కేంద్రాల్లో వారు చేసే పనులు సైతం అక్కడ అధికారులే చేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. పశువైద్యాశాలలు, వెటనరీ అసిస్టెంటు కేంద్రాలకు జిల్లా స్థాయి అధికారులు తనిఖీలకు వచ్చేటప్పుడు సొంత ఖర్చుతో అటెండర్లు చేసే పనులకు స్థానికంగా పనిచేసే వారిని రోజు వారి కూలీకి పెట్టుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. జిల్లాలోనే అధికంగా స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నియోజకవర్గంలోనే నలుగురు పశువైద్యాధికారుల పోస్టు లు ఖాళీలు ఉన్నాయి. జిల్లాలో యలమంచిలి నియోజకవర్గంలో సోమలింగపాలెం, దిమిలి, నర్సీపట్నం నియోజకవర్గంలో నర్సీపట్నం మండలంలో వేములపూడి, గొలుగొండ మండలంలో చోద్యం, మాకవరపాలెం మండలంలో బూరుగుపాలెం, నాతవరం మండలంలో శృంగవరం, నాతవరం పశువైద్యాశాలలకు వైద్యాధికారులు లేరు. వైద్యాధికారులతో పాటు సహాయకులు అటెండర్ల పోస్టులు సైతం ఖాళీలు ఉన్నాయి. నాతవరం గ్రామంలో పశువైద్య కేంద్రం ఎప్పుడు చూసినా మూసేసి ఉంటుంది. నర్సీపట్నం డివిజన్‌లో అధికంగా పాడి ఉత్పత్తి చేసే రైతులు నాతవరం మండలంలోనే ఉన్నారు. ఇక్కడ పశువులకు ఏ అనారోగ్యం వచ్చినా గోపాలమిత్రులపై ఆధారపడుతున్నారు. పూర్తి స్థాయి అధికారులు లేక ప్రభుత్వం



సిబ్బంది లేక పశువుకు వ్యాక్సిను వేస్తున్న గోపాలమిత్రుడు

- జిల్లా వ్యాప్తంగా 13 వెటర్నరీ అసిస్టెంటు (ఏడీ) కేంద్రాలు, 67 పశువైద్యశాలలు ఉన్నాయి.
- స్పీకర్ ఇలాకాలో 4 పశు వైద్యశాలల్లో వైద్యులు లేరు
- జిల్లాలో 114 మంది అటెండర్లకు 38 మంది, పశువైద్య సహాయకులు 48 మందికి 26 మంది మాత్రమే ఉన్నారు
- 67 పశువైద్యశాలలకు 60 మందే పశువైద్యాధికారులు

పాడిరైతులకు అందించే రాయితీ విత్తనాలు, ఇతర సదుపాయాలు అందడం లేదని చెబుతున్నారు. పశువుకు ఏరోగం వచ్చిన సకాలంలో వైద్యం అందక ఇటీవల పలు గ్రామాల్లో పశువులు మరణించిన సంఘనలు ఉన్నాయి. వెటనరీ ఏడీలు ఉన్నప్పటికి క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బంది లేకపోవడంతో మండలాల్లో మొక్కుబడి పర్యటనలు చేసి వెళ్తుంటారు. ప్రభుత్వం ఏదైనా కార్యక్రమం పెట్టినా పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి ఆ రోజున మాత్రమే పశువులను తరలించి ఆర్భాటం చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. పశువులకు మేకలు గొర్రెలు వైద్య సేవలు సకాలంలో అందించే వారు కరువయ్యారు.

పాడి రైతును నిర్లక్ష్యం చేయరాదు..



పాడి పరిశ్రమపై అధిక శాతం రైతులు అధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితిలో వ్యవసాయం కంటే పాడిపై అధిక అదాయం వస్తుంది. పాలు ఇచ్చే పశువుకు అనారోగ్యం వస్తే సకాలంలో వైద్యం అందకపోతే ఆ రైతు తిండి తినడు.. నిద్రపోడు. ఆ బాధ ఎలా ఉంటుందో నాకు బాగా తెలుసు. వైద్యులు లేకున్నా సహాయకులు అందుబాటులో ఉన్నా రైతు ధైర్యంగా ఉంటాడు. ఖాళీ పోస్టులు భర్తీ చేసి పాడి రైతుకు దన్నుగా ఉండాలి.

– దస్తాల రాఘవేంద్రరావు, ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్

రైతు గోడు చూస్తే బాధేస్తుంది



పశువైద్యాధికారులు, సహాయకులు సైతం లేకపోవడం వల్ల పశువుకు ఏమీ బాగోకపోయినా మాకు ఫోన్లు చేసి రైతులు రావాలంటున్నారు. మేము కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు మాత్రమే చేస్తామన్నా రైతు వినడం లేదు. పశువుకు బాగోక పాలు తగ్గిపోయాయి. వైద్యులు లేరు ఆదుకోవాలంటూ రైతులు దావేదన చెందుతుంటే చాలా బాధేస్తుంది. సిబ్బంది లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– కిల్లాడ వెంకటరమణ, గోపాలమిత్రుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జిల్లేడుపూడి గ్రామం

సిబ్బంది కొరత వాస్తవమే



జిల్లా వ్యాప్తంగా పశువైద్య శాఖలో అధికంగా సిబ్బంది కొరత ఉందన్న మాట వాస్తవమే. పాడి రైతులకు ఇబ్బంది లేకుండా ఉన్న సిబ్బందితో పశువులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం పాడి రైతులకు కల్పించే సదుపాయాలు సకాలంలో అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం.

– రామ్మోహన్‌రావు, పశువైద్యశాఖ జేడీ

నేడు నర్సీపట్నంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తుమ్మపాల : ఈ నెల 28న సోమవారం నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కలెక్టర్ కార్యాలయంలో కూడ యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం కొనసాగుతుందని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

చందనోత్సవంలో సామాన్యులకే పెద్ద పీట

- హోంమంత్రి వంగలపూడి అనిత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

సింహాచలం: ఈనెల 30న జరిగే చందనోత్సవంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అప్పన్న స్వామి నిజరూపదర్శనం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తోందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. సింహగిరిపై జరుగుతున్న చందనోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. భక్తులకు కల్పించిన సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ అంతరాలయ దర్శనాలు ఉదయం 3 గంటల నుంచి 6 గంటలలోపు మాత్రమే ఉంటాయన్నారు. ఉదయం 6 తర్వాత అంతరాలయ దర్శనాలు ఉండవని స్పష్టం చేశారు. ఈ తరుణంలో అంతరాలయ తలుపులు మూసివేసి తాళాలు వేసుకుని దగ్గర ఉంచుకోవాలని ఆలయ వైదికులు, అధికారులకు సూచించారు.

సింహగిరికి పోటెత్తిన భక్తజనం



వరాహ పుష్కరిణి వద్ద కోలలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సింహాచలం: గంధం అమావాస్య పురస్కరించుకుని సింహగిరికి ఆదివారం భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా పూజించే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణ ప్రాంత భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. శనివారం రాత్రికే సింహాచలం చేరుకున్న వీరంతా ఆదివారం తెల్లవారుజాము మూడు గంటల నుంచే కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్నానాలు ఆచరించారు. స్వామి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలను పుష్కరిణి గట్టుపై ఉంచి పూజలు నిర్వహించారు. వంటలు వండి, కోలలకు ఆరగింపు చేశారు. అమృత కలశాలను, పళ్లను సమర్పించారు. కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. మెట్ల మార్గం ద్వారా నడిచి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. స్నానమాచరించేందుకు తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి ప్రాంగణం అంతా కిటకిలాడింది. పుష్కరిణి నుంచి అడవివరం మార్కెట్ కూడలి వరకు ఉన్న మార్గం భక్తజన సంద్రంగా మారింది. సింహగిరిపై దర్శనక్యూలు, కేశఖండనశాల, ప్రసాద విక్రయశాల, గంగధార మార్గం భక్తులతో కిటకిటలాడాయి. సింహగిరికి చేరుకున్న భక్తులు సింహగిరిపై కూడా కోలలకు పూజలు నిర్వహించారు. గరిడి నృత్యాలు చేశారు. దేవస్థానం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కేజీబీవీల్లో రూ.8.55 కోట్లతో అదనపు భవనాలు

- 12 కేజీబీవీల్లో జూనియర్ కళాశాల భవనాలకు నిధులు మంజూరు
- సమగ్ర శిక్ష డీఈ గణేష్ వెల్లడి



బేతపూడి కేజీబీవీలో భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సమగ్ర శిక్ష డీఈ గణేష్, ఏఈ సంతోష్‌కుమార్

దేవరాపల్లి : జిల్లాలో 19 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) రూ.8.55 కోట్లతో మన బడి మన భవిష్యత్ పథకంలో అదనపు భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయని సమగ్ర శిక్ష డీఈ కె.గణేష్ తెలిపారు. మండలంలోని బేతపూడి కేజీబీవీలో రూ.51.93 లక్షలతో నిర్మిస్తున్న అదనపు భవన నిర్మాణ పనులను స్థానిక ఏఈ పి.సంతోష్‌కుమార్‌తో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. కాగా భవన నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో రూ.51.93 లక్షలు మంజూరు చేయగా, అప్పట్లో రూ.28 లక్షలకు సంబంధించి పనులు పూర్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మనబడి- మన భవిష్యత్‌గా పేరు మార్చి పనులను కొనసాగిస్తున్నారు. జిల్లాలోని 12 కేజీబీవీల్లో జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.1.60 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయిని డీఈ గణేష్ తెలిపారు. బేతపూడి కేజీబీవీకి కూడా జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.1.60 కోట్లు నిధులు మంజూరయ్యాయని, టెండర్ సైతం పూర్తయిందని ఆయన తెలిపారు. ఈ భవనాలలో ఆరు డార్మెటరి గదులు, రెండు టాయిలెట్లు ఉంటాయన్నారు. మన బడి- మన భవిష్యత్ పథకంలో అదనపు భవనాల నిర్మాణ పనులను వేసవి సెలవులు అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్టు డీఈ తెలిపారు. నాణ్యత ప్రమాణాలు సైతం పక్కాగా పాటిస్తూ పనులు చేపడుతున్నట్టు వివరించారు.

సొమ్మొకరిది...సోకొకరిది..!



రెండురోజుల క్రితం కొబ్బరికాయ కొట్టి మళ్లీ ప్రారంభోత్సవం చేసిన టీడీపీ నాయకులు

- పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై పచ్చ ప్రచారం
- గత ప్రభుత్వంలో రూ.2 కోట్లతో మంజూరు
- 15 రోజుల క్రితమే ప్రారంభించిన అధికారులు
- తాజాగా మంజూరైనట్టు మళ్లీ ప్రారంభోత్సవం చేసిన కూటమి నేతలు



వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మాజీ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు ఈనెల 16న సాక్షిలో వచ్చిన కథనం

నక్కపల్లి : మండలంలో వేంపాడు సబ్‌స్టేషన్‌లో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో 5 మెగా వాట్ల పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుపై టీడీపీ నాయకులు పచ్చ ప్రచారానికి తెరలేపారు. రైతులకు వ్యవసాయం కోసం పగటి పూట తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ అందించేందుకు గత ప్రభుత్వంలో మంజూరైన ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తమ ప్రభుత్వంలో మంత్రి అనిత మంజూరు చేయించారంటూ తాజాగా రెండు రోజుల క్రితం కొబ్బరి కాయకొట్టి ప్రారంభించడం నవ్వుల పాలు చేస్తోంది. వాస్తవంగా ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు 15 రోజుల క్రితమే ప్రారంభించి రైతులకు పగటి పూట వ్యవసాయ అవసరాల కోసం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే...

వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కొరత ఉంది. దీంతో వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు త్రీఫేజ్ సరఫరా చేయడం ఇబ్బందిగా మారింది. వారంలో మూడు రోజులు అర్ధరాత్రి , నాలుగు రోజులు పగటి పూట విద్యుత్ సరఫరా చేసేవారు. ఈ సమస్యను రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ద్వారా టీటీడీ చైర్మన్ వై.వి. సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో మాట్లాడి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్‌కు 5 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గత ఏడాది ఫిబ్రవరిలో మంజూరు చేయించారు. ఈ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసే పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ ఏడాది మార్చినాటికి పనులు పూర్తి చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పూర్తయినప్పటికీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రైతులకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పగటిపూట సరఫరా చేయడం లేదు. దీంతో రైతులు ఈ సమస్యను సాక్షి దృష్టికి తీసుకురావడంతో ఈ నెల 7వ తేదీన అర్ధరాత్రి సమయంలో త్రీఫేజ్ సరఫరా.. ఇబ్బంది పడుతున్న రైతులు అన్న శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం వెలువడింది. ఈ కథనానికి స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ పనులు పూర్తి చేశారు. ఏఈ మహంకాలరావు పవర్‌ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈనెల 14న కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించి రైతులకు పగటిపూట పూర్తి స్థాయిలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీనిపై ఈనెల 16న వేంపాడు సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు (సాక్షి కథనానికి స్పందన) అంటూ కథనం ప్రచురితమైంది. సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటై విద్యుత్ సరఫరా యథావిధిగా జరుగుతున్న తరుణంలో కొంతమంది టీడీపీ నాయకులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కూటమి ప్రభుత్వ హయాంలోనే జరిగిందంటూ రెండు రోజుల క్రితం కొబ్బరికాయ కొట్టి రెండోసారి ప్రారంభోత్సవం చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వీసం రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణి రాజు ఆదివారం సబ్‌స్టేషన్‌లో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేంపాడు పరిసర ప్రాంత రైతులు విద్యుత్ సరఫరాలో ఎదుర్కొంటున్న సమస్యలు తమ దృష్టికి తీసుకు రావడంతో సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లి సుమారు రూ.2 కోట్ల వ్యయంతో 5 మెగావాట్ల పవర్‌ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించడం జరిగిందన్నారు. గత ఏడాది ఫిబ్రవరిలోనే ఇది మంజూరయిందని, ఏర్పాటు పనులు పూర్తి కావడానికి ఏడాది సమయం పట్టిందన్నారు. నిధులు మంజూరు ఉత్తర్వులు రావడం, పనులు ప్రారంభం కావడం అన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగాయని, కొంతమంది టీడీపీ నాయకులు తమ ప్రభుత్వంలోనే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందంటూ గొప్పలు చెప్పుకుంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 11 నెలల కాలంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కూడా తమ ఖాతా లో వేసుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకే తాము సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, ఈశ్వరరావు, చందనాడ సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ తిరుపతిరావు, నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, పార్టీ మండలశాఖ మాజీ అధ్యక్షుడు పాపారావు, సీతంపాలెం ఎంపీటీసీ గోవిందు, పార్టీ నాయకులు అల్లాడ కొండ, బాబ్జి, సూరిబాబు, పిక్కి సత్తియ్య పాల్గొన్నారు.

జలకాలాటలలో...

సరుగుడు జలపాతం వద్ద ఆదివారం సందర్శకులతో సందడి నెలకొంది. ఎత్తయిన రెండుకొండల మధ్యలోంచి ప్రవహించే నీటిలో జలకాలు ఆడేందుకు సందర్శకులు పోటీ పడేవారు. ఎండ తీవ్రత కారణంగా వర్షాలు సరిగ్గా కురియకపోవడంతో జలపాతం నుంచి నీటి ప్రవాహం గణనీయంగా తగ్గింది. నీరు తక్కువగా రావడంతో పెద్దలతో పాటు చిన్నారులు సైతం జలకాలు ఆడేందుకు ఉత్సాహం చూపారు. గతంలో ఎక్కువగా జలపాతం నుంచి నీరు ప్రవహించడంతో ఎంతమంది అయిన సరే ఒకేసారి నీటిలో జలకాలు ఆడేందుకు వీలుగా ఉండేది. ఆదివారం జలపాతం వద్ద నీటి ప్రవాహం తగ్గడం సందర్శకులను కాస్త నిరాశపరిచింది. వేసవి సెలవులు కావడంతో దూర ప్రాంతాలు నుంచి సందర్శకులు వాహనాలపై రావడంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది.

- నాతవరం




ప్రత్యేక అలంకరణలో గవరపాలెం నూకాంబిక అమ్మవారు


అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద భక్తుల రద్దీ


అమ్మవారికి కోడిని మొక్కుతున్న మహిళా భక్తురాలు


క్యూలైన్‌ల్లో బారులు తీరిన భక్తులు


చలువ పందిళ్ల వద్ద వంటలు చేస్తున్న భక్తులు


ఎన్టీఆర్ క్రీడా మైదానంలో చిన్నారుల నృత్య ప్రదర్శన


క్యూలైన్‌లో భక్తులు

నూకాలమ్మా.. కరుణించమ్మా..

ఘనంగా గవరపాలెం నూకాంబిక నెల పండగ ముగింపు

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అనకాపల్లి:

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, గవరపాలెం నూకాంబిక అమ్మవారి నెల పండగ జాతర ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. పసుపు, కుంకుమలు, కోళ్లు, పొట్టేలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ కె.శోభారాణి, ఈవో వెంపలి రాంబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారి ఆలయ సమీపంలో చలువ పందిళ్ల వద్ద వంటలు చేసుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకుని, నైవేద్యం సమర్పించారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానంలో...

స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారి పండగను పురస్కరించుకుని నెల రోజుల పాటు దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి నెల పండగ ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల రాజారావు, మళ్ల శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ, కోనేటి సూర్యలక్ష్మి, ఎరప్రరపు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల వాహనం అడ్డగించి డబ్బు కోసం బెదిరింపులు

విశాఖకు చెందిన నలుగురు మీడియా ప్రతినిధులపై కేసు నమోదు

యలమంచిలి రూరల్ : కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న వ్యాన్‌ను అడ్డుకుని డ్రైవర్‌ను బెదిరించడమే కాక, అతని మొబైల్ ఫోన్ బలవంతంగా లాక్కొని రూ.15 వేలు డబ్బు డిమాండ్ చేసిన విశాఖ నగరానికి చెందిన నలుగురు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ట్రూత్ న్యూస్ అనే ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న విశాఖ నగరానికి చెందిన బంగారి భరత్, యండ్రపల్లి తిరుపతి, వానపల్లి శ్రీనివాసు, బొప్పా మోహనకృష్ణ కారులో యలమంచిలి మండలం లైనుకొత్తూరు వద్ద కాపు కాసి కోళ్ల వ్యర్థాలతో వెళ్తున్న వ్యాన్‌ను అడ్డగించి డ్రైవర్ పోలపర్తి అప్పలనాయుడు నుంచి మొబైల్ ఫోన్ లాక్కొన్నారు. రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి అక్కడ్నుంచి వెళ్లిపోయారు. దీనిపై రౌతులపూడి మండలం మల్లవరం గ్రామానికి చెందిన బాధితుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పీఎస్‌లో కేసు నమోదు చేసి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. మీడియా ముసుగులో బ్లాక్ మెయిల్,బెదిరింపు చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

'ఆ వివాదాన్ని బ్రాండిక్స్‌కు ఆపాదించొద్దు'

అచ్యుతాపురం: శ్రీలంకకు చెందిన ఒక మాజీ సీఈవో(బ్రాండిక్స్ కాదు), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఒక మహిళా హెచ్‌ఆర్(బ్రాండిక్స్ కాదు)కు సంబంధించి లైంగిక ఆరోపణల వివాదానికి బ్రాండిక్స్‌కు ఎటువంటి సంబంధం లేదని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. షోర్ టూ షోర్ కంపెనీకి చెందిన వివాదాన్ని బ్రాండిక్స్‌కు ఆపాదించేలా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇది తగదని ఆయన పేర్కొన్నారు. బ్రాండిక్స్ వేలాది మంది మహిళలకు గణనీయమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. లైంగిక వేధింపు వివాదాలను పరిష్కరించేందుకు తమ కంపెనీలో ప్రివెంటేషన్ ఆఫ్ సెక్సువల్ హెరాస్‌మెంట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. 2018 నుంచి న్యాయస్థాన పరిధిలో ఉన్న ఈ వివాదానికి బ్రాండిక్స్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

గతేడాది మత్స్యకార భరోసా ఎగనామం

- ఈ ఏడాది భరోసా మాత్రమే విడుదల
- మత్స్యకారులకు కూటమి దగా
- వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం


నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న శీరం నర్సింహమూర్తి, నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి జగన్

నక్కపల్లి : కూటమి ప్రభుత్వం మత్స్యకారులను మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, పలువురు మత్స్యకార నాయకులు ఆరోపించారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలల పూర్తయిందన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో రెండు సార్లు వేట నిషేధం అమలైందన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చి కేవలం ఒక ఏడాదికి సంబంధించిన పరిహారం మాత్రమే విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వంలో మత్స్యకార భరోసా రూ.4వేలు చెల్లించేవారని, జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 వేలకు పెంచినట్టు గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టిన వెంటనే మొదటి ఏడాది నుంచే వేట నిషేధ పరిహారం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ఇప్పుడు రెండేళ్ల పరిహారం చెల్లిస్తారని మత్స్యకారులంతా ఆశపడ్డారని, కూటమి ప్రభుత్వం మాత్రం వారి ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 33 వేల మందికి మత్స్యకార భరోసా అందిందన్నారు. గత జగనన్న ప్రభుత్వం మత్స్యకారుల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునేందుకు రూ.24 కోట్లతో పాయకరావుపేట నియోజకవర్గానికి ఫిష్ ల్యాండింగ్ సెంటరు మంజూరు చేసిందన్నారు. రాజయ్యపేట వద్ద నిర్మించేందుకు స్థల పరిశీలన కూడా జరిగిందని వివరించారు. ఇది పూర్తయితే ఈ ప్రాంత మత్స్యకారులకు ఉపాధితోపాటు, వలలు, ఇంజన్లు, మత్స్య సంపదను భద్రపరుచుకోవడం, ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడేదన్నారు. ఈ ఫిష్ ల్యాండింగ్ సెంటరును ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ప్రైవేటు స్టీల్‌ప్లాంటు కోసం పోర్టు నిర్మించడానికి అనుమతులు మంజూరు చేయడం సిగ్గుచేటన్నారు. అధికారం చేపట్టి 11 నెలలు గడుస్తున్నా కొత్తగా ఒక్క పింఛను కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఎరిపల్లి ముసలయ్య, మత్స్యకార నాయకులు ఎరిపల్లి నాగేశు,నూకరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

వేట నిషేధ భృతిపై మత్స్యకారుల అసంతృప్తి

అచ్యుతాపురం రూరల్ : వేట నిషేధ భృతిపై పూడిమడక మత్స్యకారులు అసంతృప్తిగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా స్పోక్స్ పర్సన్, మత్స్యకార నాయకుడు ఉమ్మిడి జగన్ అన్నారు. మత్స్యకారులకు ఒక సంవత్సరానికి మాత్రమే వేట నిషేధ భృతి ఇచ్చి చేతులు దులుపుకొన్నారని, గతేడాది భృతి కూడా ఇవ్వకుండా అన్యాయం ఆయన ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన స్థానిక మత్స్యకారులతో కలిసి నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేట నిషేధ భృతి రూ.20వేలు ఇస్తామని చెప్పారని, అలా గతేడాది, ఈఏడాది కలిసి రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద మత్స్యకారులు ప్రస్తుతం అప్పుల పాలైన దుస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి మత్స్యకారులు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు.

బావిలో పడి ఒకరి మృతి

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారి డైట్ కళాశాల వద్ద ఉన్న బావిలో ప్రమాదవశాత్తు గవరపాలెం చిన్నరామస్వామి వీధికి చెందిన పొలిమేర నాయుడు పడి ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్థానిక రైతులు, కుటుంబ సభ్యులు పోస్టు మార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని, వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన ద్విచక్ర వాహనదారుడు

అనకాపల్లి : జీవీఎంసీ విలీన గ్రామమైన కొత్తూరు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆదివారం రాత్రి గాయపడ్డారు. స్థానికులు కథనం మేరకు వివరాలివి. కొత్తూరు గ్రామానికి చెందిన ఏలూరు వెంకటేష్ జాతీయ రహదారి రోడ్డు దాటుతున్న సమయంలో అనకాపల్లి నుంచి విశాఖ వెళుతున్న ద్విచక్రవాహనదారు వెంకటేష్‌ను ఢీకొట్టడంతో అతనికి ఎడమకాలు విరిగిపోయింది. బైక్ డ్రైవ్ చేస్తున్న వ్యక్తికి ముక్కుకు, తలకు తీవ్ర గాయమైంది. హుటాహుటిన ఇద్దరిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి రూరల్ పోలీసులు చేరుకున్నారు.

డిఫెన్స్ మద్యం కలిగిన వ్యక్తి అరెస్టు


డిఫెన్స్ మద్యం బాటిల్స్‌తో పట్టుబడిన వ్యక్తితో సీఐ సునీల్‌కుమార్, సిబ్బంది

నర్సీపట్నం : డిఫెన్స్ మద్యం కలిగిన వ్యక్తిని అరెస్టు చేశామని సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి శ్రీరామనగర్ కాలనీ ఓ ఇంట్లో డిఫెన్స్ మద్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వజ్రగాడ గ్రామానికి చెందిన తమరాన అప్పలనాయుడు వద్ద నుంచి 83 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అప్పలనాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్స్ లావణ్య, నాగ శంకర్, బాబూరావు, అభిషేక్ ఉన్నారని తెలిపారు.

'మహా బోధి విహార్‌ను బౌద్ధులకే అప్పగించండి'


శాంతియాత్రలో పాల్గొన్న ఉత్తరాంధ్ర బౌద్ధ సంఘాల ఐక్య వేదిక నేతలు

సీతమ్మధార: బిహార్‌లోని మహా బోధి విహార్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా బౌద్ధులకే అప్పగించాలని ఉత్తరాంధ్ర బౌద్ధ సంఘాల ఐక్య వేదిక నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎల్ఐసీ బిల్డింగ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి జీవీఎంసీ కార్యాలయం వరకు మహా శాంతి యాత్ర నిర్వహించారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వారంతా నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నేతలు మాట్లాడుతూ మహా బోధి విహార్‌ను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిందన్నారు. అటువంటి ఈ విహార్ నిర్వహణ బాధ్యతలను పూర్తిగా బౌద్ధులకే ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కానీ అక్కడి రాష్ట్ర ప్రభుత్వం బి.టి.ఎం.సి.యాక్ట్ 1949 ప్రకారం చట్టం చేసి.. అందులో నలుగురు హిందూ మహంతులు, నలుగురు బౌద్ధ భిక్షువులతో పాటు కలెక్టర్‌ను చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. మొత్తం 9 మంది సభ్యుల్లో ఐదుగురు హిందువులే ఉండేలా చేసి.. ఆలయ అభివృద్ధి, విధానపరమైన నిర్ణయాల్లో బౌద్ధులకు ఎటువంటి ప్రాధాన్యత లేకుండా చేసిందని మండిపడ్డారు. ఈ ఆందోళనలో ఉత్తరాంధ్ర జిల్లాల జేఏసీ కన్వీనర్ వి.వి.దుర్గారావు, కో కన్వీనర్ బి.వి.జి.గౌతమ్, జేఏసీ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ మాటూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

తాటిచెట్లపాలెం(విశాఖ): ఇటీవల కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన వారికి సున్నీ ఫెడరేషన్ ఆఫ్ ఆల్ మసీద్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. టీఎస్ఎన్ కాలనీలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వీరు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు సంఘీభావంగా చిన్నారులు, పెద్దలు, మహిళలు జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో సున్నీ ఫెడరేషన్ సభ్యులు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ యాక్ట్–2025ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, జనరల్ సెక్రటరీ ఎస్.కె.నూర్ అహ్మద్, హైదర్ అలీ సింకా, ఎస్.కె.అహ్మద్ వల్లీ, రహ్మతుల్లా బేగ్, మీర్ అబ్బాస్ హుస్సేన్, మునీర్‌ఖాన్, రహమతుల్లా పాల్గొన్నారు.

తెలిసినవారి పనేనా?

కొలిక్కిరాని దంపతుల హత్య కేసు


యోగేంద్రబాబు,లక్ష్మి నివాసం ఉన్న ఇల్లు

కూర్మన్నపాలెం: రాజీవ్‌నగర్‌లో జరిగిన దంపతుల హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. తొలుత ఈ హత్యలను దోపిడీ దొంగలే చేసి ఉంటారని పోలీసులు, స్థానికులు భావించారు. ఆ కోణంలోనే పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. అయితే విదేశాల నుంచి వచ్చిన మృతుల కుమార్తె, కుమారుడు ఇంట్లోని బీరువాలను తెరిచి పరిశీలించగా.. అందులో నగదు, బంగారు నగలు చెక్కు చెదరకుండా ఉన్నట్లు గుర్తించారు. పోలీసుల సమక్షంలోనే బీరువాలను పరిశీలించగా 30 తులాల బంగారం, రూ. 10 వేల నగదు సురక్షితంగా ఉన్నట్లు తేలింది. దీంతో ఈ హత్యలు డబ్బు లేదా ఆభరణాల కోసం జరగలేదని స్పష్టమైంది. ఈ కీలక పరిణామంతో హత్యలపై పోలీసుల దర్యాప్తు కోణం మరో మలుపు తిరిగింది. ఘటనా స్థలంలోని పరిస్థితులు, హత్యకు ఉపయోగించిన ఆయుధాలను పరిశీలిస్తే.. వారికి బాగా తెలిసిన వారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. వంట గదిలో కూరగాయలు కోసేందుకు ఉపయోగించే రెండు కత్తులతోనే ఈ హత్యలు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇంటితో బాగా పరిచయం ఉన్న వారికే వస్తువులు ఎక్కడ ఉంటాయో తెలుస్తుందని భావిస్తున్న పోలీసులు.. ఇప్పుడు దర్యాప్తును ఆ దిశగా మళ్లించారు. దీంతో మృతుల కుటుంబంతో సన్నిహిత పరిచయాలున్న వారిని, ఇంటికి తరచుగా వచ్చిపోయే వారిని, ఆ కుటుంబ సభ్యులకు చనువుగా ఉండేవారి వివరాలను సేకరించి.. వారిని ప్రశ్నిస్తున్నారు. ఈ దారుణ ఘటనపై నగర పోలీసు ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. క్రైం పోలీసులు, అధికారులు మఫ్టీలో ఆ ప్రాంతమంతా జల్లెడ పడుతున్నారు. ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు దొరక్కపోవడంతో.. కేసును ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియక ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు.

మే 20న జాతీయ సమ్మె

లేబర్ కోడ్స్, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల పిలుపు

డాబాగార్డెన్స్(విశాఖ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల, కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాలు మే 20న జాతీయ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు, ఏఐటీయూసీ నాయకుడు డి.ఆదినారాయణ, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, సీఎఫ్‌టీయూఐ అధ్యక్షుడు ఎస్.కనకారావు, హెచ్ఎంఎస్ నాయకుడు గణపతిరెడ్డి, ఏపీఎఫ్‌టీయూ నాయకుడు దేవా మాట్లాడారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని, దీని వల్ల నిరుద్యోగం పెరిగి, ఉద్యోగ భద్రత తగ్గిందని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తూ, 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. ఈ కోడ్స్ అమలైతే పని గంటలు 8 నుంచి 15కి పెరిగే ప్రమాదం ఉందని, కార్మికులు సంఘం నెలకొల్పడం, సమ్మె చేయడం, వేతనాల కోసం పోరాడే హక్కులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వే, పోర్టులు, విమానాశ్రయాలు, బ్యాంకులు మొదలైనవాటిని ప్రైవేటీకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయిమెంట్, అగ్నిపథ్ రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగంలో ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. మే 3 లోపు పరిశ్రమల వారీగా సమ్మె నోటీసులు ఇవ్వాలని, 10 లోపు జిల్లా, మండల, పట్టణ స్థాయి సదస్సులు నిర్వహించాలని, 16 నుంచి 19 వరకు ప్రచార యాత్రలు చేపట్టాలని, మే 20న భారీ ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని కార్యాచరణను ప్రకటించారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆర్‌కేఎస్‌వీ కుమార్, బి.నాగభూషణం, మన్మధరావు, ఆయా యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్. రామకృష్ణ తెలిపారు. నరసింగబిల్లి, జె.తుని, ఎన్.జి. పాలెం, త్రిపురవానిపాలెం, గొబ్బూరు, తాళ్లపాలెం, బంగారయ్యపేట, ఉగ్గినపాలెం, వరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, గంటవానిపాలెం, ఏఎస్ పేట, సోమవరం, ఏనుగుతుని, చిన ఏనుగుతుని, జి. భీమవరం, సింగవరం, అచ్చెర్ల, కొత్త అచ్చెర్ల, మోనయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు నిర్దేశిత సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందన్నారు. తాళ్లపాలెం పరిధిలోని వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాను మార్పు చేస్తున్నామని, ఉదయం 4 నుంచి 8 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి వేసవి శిక్షణ


మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి జగన్నాథం

కశింకోట: మండలంలోని రెండు శాఖా గ్రంథాలయాల్లో సోమవారం నుంచి విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ఈ సందర్భంగా తాళ్లపాలెం గ్రంథాలయంలో రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని గ్రంథాలయ అధికారి కె. జగన్నాథం ఆదివారం తెలిపారు. విద్యార్థులకు విజ్ఞానదాయకమైన కథలు వినిపించడం, నీతి కథలు చెప్పించడం, పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లిషు, డ్రాయింగ్, పెయింటింగ్, కాగితాలతో బొమ్మల తయారీ, జనరల్ నాలెడ్జ్ క్విజ్, డాన్స్, ఆటలు తదితర వాటిని నిపుణులతో నేర్పించనున్నట్లు తెలిపారు. దీని దృష్ట్యా తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపాలని కోరారు.

వేసవి తాపంతో విలవిల

కశింకోట: మండల ప్రజలు సూర్య తాపంతో ఆదివారం సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడి ఇళ్లకే పరిమితమయ్యారు. అత్యవసర పనులున్న వారు మాత్రమే గొడుగులు, టోపీలు రక్షణగా ధరించి బయటకు వచ్చారు.

ఆటో బోల్తా..

- నలుగురికి స్వల్ప గాయాలు

అనకాపల్లి: మండలంలో ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్ కొత్తూరు వద్ద టర్నింగ్ పాయింట్‌లో అనకాపల్లి నుంచి కూండ్రం వైపు వెళ్తున్న ఆటో ఆదివారం రాత్రి బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీస్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం


మాట్లాడుతున్న డాక్టర్ గోపాలరావు

నర్సీపట్నం: మున్సిపల్ స్టేడియంలో సమ్మర్ క్యాంపులో స్పోర్ట్స్‌లో ఉచిత శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఆదివారం డాక్టర్ అధికారి గోపాలరావు, విశ్రాంత ఎంఈవో నాగేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకులు నారాయణమూర్తి, కూరసా చిట్టిబాబు పౌష్టికాహారం అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డాక్టర్ గోపాలరావు చిన్నారులకు సూచించారు.

అనకాపల్లి సినిమాలు

రాజా	: జింఖానా
సత్యనారాయణ స్క్రీన్-1	: అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి
సత్యనారాయణ స్క్రీన్-2	: సారంగపాణి జాతకం
పర్తిసాయి	: ఓదెలా-2
షిర్డీసాయి	: అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి
వెంకటేశ్వర	: పాతం
శ్రీసత్య	: భరత్ అనే నేను
రామచంద్ర	: తుడరుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-18, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 196 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

మామిడి.. తగ్గిన దిగుబడి


కాపు తగ్గిన మామిడి


క్రేట్లలో నింపి ఎగుమతికి సిద్ధం చేసిన మామిడి

- అకాల వర్షాలు, మంచు ప్రభావంతో నష్టం
- మందకొడిగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి
- చిత్తూరు నుంచి కాయల దిగుమతి

కశింకోట: మామిడికాయలకు మార్కెట్లో ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేకపోగా, దిగుబడి తగ్గిపోవడంతో రైతులు దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలో ఈ ఏడాది మామిడి కాయల ఎగుమతి మందకొడిగా మొదలైంది. వాతావరణం అనుకూలించక కాయల దిగుబడి ఆలస్యం అయింది. ఇప్పటికే ముమ్మరంగా సాగాల్సిన ఎగుమతి జరగడం లేదు. మరో వైపు చిత్తూరు జిల్లా మామిడి ఎగుమతి నుంచి పోటీ ఏర్పడింది. దీంతో ధర తగ్గిపోవడంతో వ్యాపారులు దిగాలు చెందుతున్నారు. ఇలా అయితే ఈ ఏడాది తట్టాబుట్టా సర్దుకోవాల్సిందేనని నిట్టూరుస్తున్నారు.

మండలంలోని కన్నూరుపాలెం కేంద్రంగా ఏటా రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు మామిడి కాయల ఎగుమతి అవుతోంది. ప్రధానంగా ఒడిశా, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు వీటిని ఎక్కువగా ఎగుమతి చేస్తారు. మామిడి కాపు బాగా కాస్తే సుమారు వెయ్యి టన్నుల వరకు ఎగుమతి అవుతోంది. ఐదు కోట్ల పైబడి వ్యాపార లావాదేవీలు సాగుతాయి. అయితే ఈ ఏడాది పూత సమయంలోనే అకాల వర్షాలు కురవడం, మంచు ఎక్కువగా పడటంతో తేనె మంచు పురుగు ఆశించి పంటకు నష్టాన్ని కలిగించింది. దీంతో కాయ పిందె కట్టక దిగుబడి తగ్గిపోవడమే కాకుండా కాపు ఆలస్యం అయింది. ఇంకా కాయ ఎదుగుదల లేదు. పక్వానికి రాలేదు. దీంతో ఇప్పటికే ముమ్మరంగా జరగాల్సిన ఎగుమతులు మందకొడిగా జరుగుతున్నాయి.గత ఏడాది ఈ సమయానికి 200 టన్నుల వరకు ఎగుమతులు అయ్యాయి. అయితే ఈ ఏడాది 40 టన్నులు కూడా ఎగుమతి కాలేదని వ్యాపారులు వాపోతున్నారు.


క్రేట్లలో నింపడానికి సిద్ధంగా ఉంచిన మామిడి కాయలు

ఎకరా రూ.20 వేల వరకు కౌలు చెల్లించి

కన్నూరుపాలెం నుంచి ఎగుమతి అయ్యే మామిడి మండల గ్రామాలైన కన్నూరుపాలెం, అడ్డాం, చెరకాం, తీడ, మాకవరపాలెం మండలం భీమబోయిన పాలెం, రావికమతం మండలం తోటకూరపాలెం తదితర చుట్టు పక్కల ఉన్న గ్రామాల నుంచి చేరుతుంది. ఆయా ప్రాంతాల్లో సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో మామిడి సాగవుతోంది. ఏటా పూతకు ముందే ఇక్కడి వ్యాపారులు రైతుల నుంచి ఎకరా రూ.20 వేల వరకు కౌలు చెల్లించి మామిడి తోటలకు సాగుకు తీసుకుంటారు. వాటికి ఎరువులు వేసి యాజమాన్య పద్ధతులు పాటించి పూత సమయంలో క్రిమి సంహారక మందులు జల్లుతారు, కాయ పక్వానికి వచ్చి కోత దశకు రాగానే వాటిని చెట్టు నుంచి తీసి ఎగుమతికి సిద్ధం చేస్తారు. బంగినపల్లి, సువర్ణరేఖ, కలెక్టర్ రకాల మామిడి కాయలు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతాయి. వీటిలో బంగినపల్లి, సువర్ణరేఖ తినడానికి, కలెక్టర్ ఒడిశాలో రసాల తయారీకి వినియోగిస్తారు. చెట్ల నుంచి సేకరించిన కాయలను క్రేట్లలో నింపి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. కిలోల లెక్కన వీటికి ధర నిర్ణయించి ఎగుమతి చేస్తారు. గత ఫిబ్రవరి నెలలో ప్రారంభంలో కిలో రూ.70 ధర ఉండగా, ప్రస్తుతం కిలో రూ.40కి పడిపోయిందని వ్యాపారులు వాపోతున్నారు. అదే కలెక్టర్ రకానికి అయితే రూ.15 ఉందంటున్నారు. రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా నుంచి మామిడి పంట బాగా పండటంతో ఎక్కువగా మామిడి విశాఖతోపాటు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. దీంతో ఇక్కడి మామిడికి డిమాండ్ తగ్గింది. పైగా ఇంకా ఎదుగుదల లేక కోత దశకు పూర్తిగా రాలేదు. పైగా ధర తగ్గిపోయి నష్టపోయే పరిస్థితి ఈ ఏడాది ఏర్పడనుందని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. పైగా దిగుబడి తగ్గిపోయి మరింత నష్టం కలగనుందంటున్నారు. ఈ ఏడాది 500 టన్నులు కూడా ఎగుమతి కావడం గగనమే నంటున్నారు. ఇలా అయితే తాము తీవ్రంగా నష్టపోతామని, ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

ధర పడిపోయింది



రైతులకు ముందుగా కౌలు చెల్లించి మామిడి తోటలు తీసుకున్నాయి. ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఎరువులు వేసి క్రిమి సంహారక మందులు జల్లి యాజమాన్య పద్ధతులు పాటించాం. అయితే వాతావరణం అనుకూలించక దిగుబడి తగ్గిపోయింది. ధర కూడా సగాని పడిపోయింది. ప్రారంభంలో కిలో రూ.70 ఉండగా, ఇప్పుడు రూ.40 కూడా రావడం లేదు. చిత్తూరు నుంచి మామిడి ఎగుమతి అవుతుండటంతో పోటీ ఎదురవుతోంది. ముమ్మరంగా జరగాల్సిన ఎగుమతులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఇలా అయితే ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉంది.ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– బి.శ్రీనివాసరెడ్డి, మామిడికాయ ఎగుమతి వ్యాపారి, కన్నూరుపాలెం

ఇష్టపడి చదువుకుంటే ఉన్నత శిఖరాలకు


విద్యార్థులతో మాట్లాడుతున్న మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి కష్టపడి చదువుకోవడం కంటే ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు తెలిపారు. స్థానిక నర్సింగరావుపేటలో లక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిసెట్ కోచింగ్ పొందిన విద్యార్థులతో ఆదివారం ఆయన మాట్లాడారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు జీవితంలో త్వరగా స్థిరపడాలంటే టెక్నికల్ విద్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాపవరపు సత్యనారాయణ, ఉపాధ్యాయులు శేఖర్, రాజు, కిశోర్, వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకులు కూండ్రపు సత్తిబాబు, కోన ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో నూకాంబిక దేవాలయ సమీపంలో మహాత్మ జ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించారు. దీనిలో భాగంగా పరీక్ష రాసేందుకు 201 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 180 మంది పరీక్షకు హాజరయ్యారని ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రవేశ పరీక్ష రాశారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, మెడికల్ క్యాంప్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సర్వీస్ రహదారి పునర్నిర్మించాలని ధర్నా


ఉమ్మలాడ జంక్షన్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ ప్రజలు

అనకాపల్లి: స్థానిక జాతీయ రహదారిలో సర్వీసు రోడ్డును తక్షణమే పునర్నిర్మించాలని మునగపాక మండలం ఉమ్మలాడ గ్రామస్తులు ఆదివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారికి అటువైపు అనకాపల్లి మండలం ఇటు వైపు మునగపాక మండలంలో ఉమ్మలాడ, ముత్రాసు కాలనీ గ్రామాలు ప్రజలు, రైతులు నిత్యం అనకాపల్లి పట్టణానికి రాకపోకలు సాగిస్తారన్నారు. గతంలో ఉన్న సర్వీస్‌రోడ్డు మూసివేయడంతో జాతీయ రహదారిపై నుంచి వెళ్లే సమయంలో రోడ్డుప్రమాదాలు జరిగి మృత్యువాత పడుతున్నారని, అనేక మంది క్షతగాత్రులు మిగిలిపోయారని వాపోయారు. జాతీయ రహదారి అధికారులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరులో విశాఖ త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ప్రతినిధులు ఆదివారం భగవద్గీత ప్రచారం చేపట్టారు. జ్ఞాన వేదిక విశాఖ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు దివ్యాశీస్సులతో 101 త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథాలు గురించి వివరించి వారి జీవితంలో జ్ఞానమార్గాన్ని అనుసరించాల్సిందిగా కోరామన్నారు. పౌర్ణమి అనునది పూర్ణ దైవ జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. అమావాస్య అనునది అజ్ఞానానికి చిహ్నం అన్నారు. కృష్ణుని, భగవద్గీతను విశ్వసించకపోతే అమావాస్య వైపు నడచి అజ్ఞానంలో మునిగి మోక్షం పొందలేరన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు రమణ, నాగమణి, సత్యవతి, దేవి, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.


భగవద్గీత ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు

సివిల్స్ ర్యాంకర్‌కు ఘన సత్కారం


సాయి మోహిని మానసను సత్కరిస్తున్న లక్ష్మీపార్వతి, ఫణిభూషణ్ శ్రీధర్

అనకాపల్లి: యూపీఎస్సీ పబ్లిక్ పరీక్షల్లో 975వ ర్యాంకు సాధించిన గవరపాలేనికి చెందిన రావాడ సాయి మోహిని మానసను డాక్టర్ కొణతాల రామలింగస్వామి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కొణతాల లక్ష్మీపార్వతి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ ఆదివారం తుమ్మపాల పంచాయతీ చిన్నబాబు కాలనీలో పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ పేదలకు సేవా చేయాలంటే సివిల్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడమే మార్గమని ఇష్టపడి చదువుకున్నట్టు తెలిపారు. రెండు దఫాలు తప్పినప్పటికీ పట్టు వదలకుండా మూడోసారి సివిల్స్‌లో 975వ ర్యాంకు సాధించానన్నారు. ప్రస్తుతం విశాఖ పెద్దవాల్తేరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరు నెలలుగా కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్నానన్నారు. సివిల్స్‌కు ఆన్‌లైన్లో కోచింగ్ తీసుకున్నానన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యల్లపు సూరిప్పారావు, పెంటకోట ఉమా మహేశ్వరరావు, మల్ల జగదీష్, శైలజ, కాండ్రేగుల వెంకటరమణ, మైశెట్టి సత్తిబాబు, డాక్టర్ కొణతాల గణేష్, దూదిపల్లి కొండలరావు, చౌదరి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఆలనాపాలనా కరువు



నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రం


ఎన్టీఆర్ ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

అనకాపల్లి టౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు ఆలనాపాలనా కరువైంది. లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి పట్టణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎన్టీఆర్ ఆస్పత్రి, సత్తెమ్మతల్లి ఆర్చి, బండిగాడి వీధి, గూండాల కూడలి, పూడిమాడక రోడ్, కొప్పాక, పెరుగుబజార్, తహసీల్దార్ కార్యాలయం పక్కన్న, రైల్వే స్టేషన్, రింగ్‌రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేసారు. వీటి ద్వారా ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ కేంద్రాల్లో 500 లీటర్ల ట్యాంక్‌ను ఏర్పాటు చేసి, మంచినీటి కుండల ద్వారా నీటిని ప్రజలకు అందించాలి. కానీ ఏ చలివేంద్రం దగ్గర కుండల ద్వారా నీటిని అందించే కేర్ టేకర్ ఉండడం లేదు. జిల్లా కేంద్రం కావడంతో అత్యధికంగా సమీప ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని, దీని వలన లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని ప్రజలు వాపోతున్నారు.

వైభవంగా గంధం అమావాస్య పండగ


దర్శించుకుంటున్న భక్తులు


దర్శనానికి భక్తుల బారులు


కశింకోటలో నూకాంబిక అమ్మవారికి భక్తుల పూజలు


ఆలయ ప్రాంగణంలో భక్తుల గంప జాతరలు


జాతర ఊరేగింపుగా దర్శనానికి తరలి వస్తున్న భక్తులు

కశింకోట: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. గంధం అమావాస్య (నెల పండగ), వారపు పొద్దు కలసి రావడంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చీరలు, రవికెలు, అరటి గెలలు వగైరా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు డప్పులు, సారెతో జాతరగా తరలివచ్చి దర్శించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వేగి శివగణేష్ ఆధ్వర్యంలో అమ్మవారిని నూతన వస్త్రాలు, పూలదండలతో అందంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. కొందరు కుటుంబ సభ్యులతో వచ్చి గంప జాతరలు జరుపుకున్నారు. వంటలు చేసుకొని సంప్రదాయంగా భోజనాలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయింది.

పూడిమడక తీరంలో మెరైన్ పోలీసుల తనిఖీ


మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న సిఐ సింహాద్రినాయుడు

అచ్యుతాపురం రూరల్: పూడిమడక తీరంలో ఆదివారం మెరైన్ పోలీసులు మత్స్యకారులకు అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు తీరంలో తారసపడితే వెంటనే సమాచారం అందించాలని మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు, కొత్త బోట్లు, కలర్ కోడ్ అనుమానంగా ఉన్నట్లయితే వెంటనే మెరైన్ పోలీసులకు లేదా 1093 టోల్ ఫ్రీ నెంబరుకు సంప్రదించి సమాచారం అందివ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ దేశ భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తీరంలో మెరైన్ సీఐ ఆధ్వర్యంలో సిబ్బంది బోట్లు తనిఖీ నిర్వహించారు.

వైభవంగా ముగిసిన నూకాంబిక జాతర


తాకాశివీధి నూకాంబిక అమ్మవారు


అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన ప్రారంభిస్తున్న రాంకీ

అనకాపల్లి: స్థానిక తాకాశివీధి నూకాంబిక జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. శతాబ్దాల చరిత్ర కలిగి, స్వయం భూగా పుట్టలో వెలసిన అమ్మవారి జాతరను తాకాశివీధి కుటుంబ సభ్యులు ఏటా ఘనంగా నిర్వహిస్తుంటారు. నెల రోజులపాటు అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఆలయ చైర్మన్ తాకాశి కిశోర్ తెలిపారు. జాతర ముగింపు కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భీమరశెట్టి రాంకీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనే లక్ష్యం

చోడవరం: అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే ఆశయాల సాధనకు యువత పని చేయాలని దళిత విముక్తి రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ అన్నారు. అంబేడ్కర్, జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని చోడవరం ప్రేమ సమాజంలో ఆదివారం సామాజిక చైతన్య సదస్సు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ భవనం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రేమ సమాజం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరికీ సముచిత స్థానం కల్పించినప్పటికీ నేటికీ దళితులను అణిచివేసే ధోరణి కొనసాగుతుందన్నారు. దళితులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు ఎప్పటికప్పుడు పోరాటాలు చేయాలని ఆయన పిలుపుఇచ్చారు. దళిత హక్కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లిస్తే భూమిలిచ్చేది లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి ప్రభుత్వం పరిహారంగా టీడీఆర్ బాండ్లే ఇవ్వాలనుకుంటే ఎవ్వరూ భూములిచ్చేది లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తేల్చిచెప్పారు. ఆదివారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో రహదారి విస్తరణ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధికి రహదారి విస్తరణ ఆవశ్యమని, అయితే పరిహారం మాత్రం నేరుగా నగదు రూపంలో అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు. అంతేకాని టీడీఆర్ బాండ్లు ఇస్తే తీసుకునేది లేదన్నారు. కొంతమంది అధికారులు గుట్టుచప్పుడు కాకుండా అమాయక నిర్వాసితులతో సంతకాలు చేసేందుకు యత్నిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. టీడీఆర్ బాండ్ల వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన మాట మేరకు ప్రతీ బాధితునికి పరిహారాన్ని అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు.